తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
07-06-2024
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 287 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక జయభేరి చానల్లో నికార్సైన జర్నలిస్టులుగా నిలబడాలను కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889
జయభేరి




# మోడీ ప్రమాణానికి విదేశీ నేతలు


దేశంలో లోక్‌సభ కు జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ సంపూర్ణ మెజారిటీ సాధించడంతో మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎన్డీఏ సమావేశంలో ఈ మేరకు ఎన్డీఏ పక్షనేతగా నరేంద్ర మోదీని ఎన్నుకున్నారు. దీంతో ప్రధాని నరేంద్ర మోడీ ప్రమాణస్వీకారానికి భారతీయ జనతా పార్టీ ఏర్పాటు చేస్తోంది.ఈ నెల ఎనిమిదో తేదీన రాత్రి 8 గంటలకు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి పలు దేశాలకు చెందిన కీలక నేతలు హాజరు కానున్నారు.




# ప్రతిపక్ష నేతగా రాహుల్

ఊహించని రీతిలో ప్రతిపక్ష కూటమి పుంజుకోవడం వల్ల దేశ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. మొగ్గు పూర్తిగా బీజేపీపై వైపే ఉంటుందని అనుకున్నా ప్రతిపక్షాలూ గట్టిగానే నిలబడ్డాయి. ఇండీ కూటమిలో సంప్రదింపులు, చర్చలు కొనసాగుతున్నాయి. అటు NDA కూటమి కూడా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మద్దతుని కూడగట్టుకుంటోంది. ఈ క్రమంలోనే లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఎవరుంటారన్న చర్చ ఇండీ కూటమిలో మొదలైంది. మొత్తం సేనను ముందుండి నడిపించిన రాహుల్ గాంధీకీ ఆ అవకాశం దక్కుతుండొచ్చని కొందరు అంచనా వేస్తున్నారు.

## చంద్రబాబుకు రేవంత్ ఫోన్





జయభేరి, హైదరాబాద్, జూన్ 6

టీడీపీ అధినేత చంద్రబాబుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్ చేశారు. ఏపీలో టీడీపీ 130కి పైగా సీట్లు సాధించడం పట్ల రేవంత్ రెడ్డి కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగిద్దామని కోరారు. త్వరలోనే ఏపీ  తెలంగాణ మధ్య విభజన సమస్యలను పరిష్కరించుకుందామని కోరినట్లు తెలిసింది.అయితే, తాను చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్తానని రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధిష్ఠానం అనుమతిస్తే తప్పకుండా ఆ కార్యక్రమానికి వెళ్తానని చంద్రబాబు విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు.ఏపీలో జూన్ 4న విడుదలైన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీడీపీ 135 సీట్ల భారీ మెజారిటీని సొంతంగా సాధించిన సంగతి తెలిసిందే. జనసేన కూడా 21 స్థానాలతో పోటీ చేసిన ప్రతి చోటా గెలిచింది. వైఎస్ఆర్ సీపీ 11 చోట్లకే పరిమితం అయింది. బీజేపీ మాత్రం 8 స్థానాల్లో గెలిచింది. ఏపీలో ప్రభుత్వ ఏర్పాటుకు పూర్తిస్థాయిలో కూటమి భారీ మెజారిటీలో ఉండడంతో 12వ తేదీన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్నారు.



## మా నుంచి హేమ సస్పెండ్

జయభేరి, హైదరాబాద్, జూన్ 6:

మా అసోసియేషన్ నుంచి నటి హేమను సస్పెండ్ చేస్తూ అధ్యక్షుడు మంచు విష్ణు కీలక నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ఆమె మా సభ్యత్వాన్ని రద్దు చేశామని ఆయన మీడియా సమావేశంలో వెల్లడించారు. క్యారెక్టర్ ఆర్టిస్టుగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన హేమ సినిమా కెరియర్ ప్రమాదంలో పడింది.. ఇటీవల బెంగళూరులో రే* పార్టీ, మాదకద్రవ్యాల కేసులో

...మిగతాది 2 లో

## ప్రధానిని కలిసిన పవన్

జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 6:

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రదాని మోదీతో సమావేశం అయ్యారు. ఆయన వెంట సతీమణి అన్నా లెజ్ నోవా, కుమారుడు అకీరానందన్ ఉన్నారు. ఎన్డీఏ కూటమి సమావేశం కోసం ఢిల్లీ వెళ్లిన పవన్ కల్యాణ్ అక్కడే ఉన్నారు. మరోసారి శుక్రవారం ఎన్డీఏ కూటమి సమావేశం జరగనుంది. ప్రధాని మోదీ సమయం ఇవ్వడంతో ఆయనతో మరోసారి సమావేశం అయ్యారు. కుటుంబాన్ని పరిచయం చేశారు. తన

...మిగతాది 2 లో



## 12వ తేదీ 12 గంటలకు

### చంద్రబాబు నాలుగోసారి సీఎం ప్రమాణం



జయభేరి, విజయవాడ, జూన్ 6:

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రమాణ స్వీకారం తేదీలో మార్పు చోటు చేసుకుంది. గతంలో జూన్ 9న ఏపీ కొత్త సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించారు. అయితే జూన్ 12న ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తాజాగా ప్రకటించారు. ఏపీలో ఎన్డీయే కూటమి భారీ విజయాన్ని కైవసం చేసుకుంది. జూన్ 4న వెలువడిన ఫలితాల్లో

...మిగతాది 2 లో

## కాళేశ్వరం ప్రాజెక్టుపై తనిఖీలు

- మేడిగడ్డ, అన్నారం సుందిళ్ల బ్యారేజ్ లపై ప్రత్యేక అధ్యయనం
- కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ కు 50కు పైగా ఫిర్యాదులు
- నేడు రాష్ట్రానికి జస్టిస్ పీయూష్ ఘోష్
- 7, 8 తేదీల్లో అన్నారం, సుందిళ్ల పరిశీలన
- రేపు కడెం, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో మంత్రి ఉత్తమ్ పర్యటన
- మేడిగడ్డలో నేడు 16, 17 గేట్లు ఎత్తేందుకు కసరత్తు



▶▶ మొదటిపేజీ తరువాయి

## మోడీ ప్రమాణానికి విదేశీ నేతలు

ప్రధాని నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతున్న వారి జాబితాలో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, శ్రీలంక అధ్యక్షుడు రనిల్ విక్రమ్ సింఘే ఉన్నట్లు ఎన్డీఏ వర్గాలు చెబుతున్నాయి. వీరితోపాటు భూటాన్, నేపాల్, మారిషష్ దేశాలకు చెందిన నేతలను ఆహ్వానించే అవకాశం ఉందని బిజెపి వర్గాలు చెబుతున్నాయి.శ్రీలంక ప్రధాని మోదీ రణీల్ విక్రంసింఘేకు ఫోన్ చేసి ప్రమాణస్వీకారం మహోత్సవానికి ఆహ్వానించినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో మోడీ ఫోన్ లో సంభాషించారు. వికసిత్ 2047, స్మార్ట్ బంగ్లాదేశ్ 2041 సాధించడానికి కలిసి పని చేయడం అవసరమని ఈ సందర్భంగా ప్రధాని మోదీ షేక్ హసీనాతో చెప్పినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ విజయం పట్ల ఆమె అభినందించారు. నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ, భూటాన్ ప్రధాని షేరింగ్ టోబ్గే, మారిషస్ ప్రధాని ప్రవింద జగ్నాథ్ ను కూడా ఆహ్వానించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విదేశీ నేతలకు అధికారికంగా గురువారం ఆహ్వానాలు పంపనున్నారు. 2019లో నరేంద్ర మోడీతోపాటు 24 మంది కేంద్ర మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. 24 మంది సహాయ మంత్రులు, తొమ్మిది మంది స్వతంత్ర మంత్రులుగా రాష్ట్రపతి భవన్ లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈసారి మోదీ 3.0 క్యాబినెట్ లో మిత్రపక్షాల నుంచి ఎక్కువ ప్రాధాన్యత లభించే అవకాశం ఉంది. బిజెపి సొంతంగా మెజారిటీ సాధించలేకపోవడంతో మిత్రపక్షాలకు అవకాశం దక్కనుంది.2019లో లోక్ సభ ఎన్నికల విజయం తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి బిమ్స్ టెక్ దేశాల నేతలను భారత్ ఆహ్వానించింది. 2019లో ప్రధానిగా నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వివిఐపీలతో సహా ఎనిమిది వేల మంది అతిథులు హాజరయ్యారు. 2014లో తొలిసారి ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలను చేపట్టినప్పుడు అప్పటి పాకిస్థాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ సహా షార్క్ దేశాలకు చెందిన నాయకులందరూ హాజరయ్యారు.

## ప్రతిపక్ష నేతగా రాహుల్

బీజేపీ తరవాత ఎక్కువ సీట్‌లు వచ్చింది కాంగ్రెస్‌కే. అంటే ప్రతిపక్ష హోదా ఈ పార్టీకి వచ్చేసింది. అందుకే ఈ పార్టీకి చెందిన రాహుల్ గాంధీనే ప్రతిపక్ష నేతగా ఉంటారన్న చర్చ మొదలైంది.. రాహుల్ గాంధీయే గా ఎన్నికవుతారని సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్ సీనియర్ నేతలు ఈ ప్రతిపాదన తీసుకొచ్చారు. అయితే...కాంగ్రెస్ పార్లమెంటరీ మీటింగ్‌లో దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ రాహుల్ గాంధీయే ప్రతిపక్ష నేతగా ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. ట్విటర్‌లో ఓ పోస్ట్ పెట్టారు. "నేను ప్రజలను ఓట్లు అడిగింది రాహుల్ గాంధీ పేరు చెప్పుకునే. లోక్‌సభలో ఆయనే ప్రతిపక్ష నేతగా ఉండాలి. ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలంతా ఈ ప్రతిపాదనకు మద్దతునిస్తారని అనుకుంటున్నాను. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఏం నిర్ణయిస్తుందో వేచి చూస్తాం" మాణికం ఠాగూర్, కాంగ్రెస్ నేత... లోక్‌సభలో ప్రతిపక్ష నేత కావాలంటే కనీసం 55 ఓట్ల మద్దతు కావాలి. 2014లో కాంగ్రెస్‌కి 44 స్థానాలు రాగా 2019లో ఈ సంఖ్య 52కి పెరిగింది. ఈ సారి 99కి చేరుకుంది. అందుకే అందరూ రాహుల్ గాంధీ పేరునే ప్రతిపాదిస్తున్నారు. ఇండీ కూటమి రాణించడంలో రాహుల్ కీలక పాత్ర పోషించారు. ఒకప్పుడు కాంగ్రెస్‌కే పరిమితమైన ఆయన ఇప్పుడు ప్యాన్ ఇండియా పొలిటీషియన్‌గా పేరు తెచ్చుకున్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై తనిఖీలు

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ గురువారం హైదరాబాద్‌కు రానున్నారు. 7న అన్నారం, 8న సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించనున్నారు. ఈనెల 10వ తేదీలోపు బ్యారేజీలకు మరమ్మతులు / పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరిన విషయం విదితమే. నిపుణుల కమిటీ కూడా ఇప్పటికే బ్యారేజీలను పరిశీలించింది. పనులు ఎంత వరకూ చేపట్టారన్న విషయాన్ని తెలుసుకోవడానికి పీసీ ఘోష్ క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. మరోవైపు కడెం ప్రాజెక్టుతోపాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరిశీలించనున్నారు. కడెం ప్రాజెక్టులో మరమ్మతులకు ప్రభుత్వం రూ.3.81 కోట్లను కేటాయించగా... ఆ నిధులతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనులను మంత్రి ఉత్తమ్ పరిశీలించి, తగిన ఆదేశాలు ఇవ్వనున్నారు. ఆ తర్వాత సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలనూ పరిశీలించనున్నారు. కాగా, మేడిగడ్డ బ్యారేజీలో 16, 17వ నంబర్ గేట్లను బలవంతంగా ఎత్తే ప్రక్రియ గురువారం చేపట్టనున్నారు. ఈ మేరకు ఈఎన్సీ (జనరల్) గుమ్మడి అనిల్‌కుమార్‌తో పాటు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) ఓరుగంటి మోహన్‌కుమార్ మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు 54 ఫిర్యాదులు అందాయి. గత మే 31వ తేదీలోగా కమిషన్ కార్యాలయానికి నోటరీ ద్వారా అఫిడవిట్ రూపంలో ఫిర్యాదు చేయాలని కమిషన్ తరపున నీటిపారుదల శాఖ బహిరంగ ప్రకటన ఇచ్చింది. గడువు పూర్తయిన తర్వాత ఎన్ని ఫిర్యాదులు వచ్చాయని లెక్క తీయగా... 54 దాకా వచ్చినట్లు తేలింది. కాగా, బ్యారేజీల నిర్మాణంలో నిర్ణయాత్మక పాత్ర పోషించిన అధికారులు, ఇంజనీర్లు, మాజీ ప్రజాప్రతినిధులకు రెండో వారం లేదా మూడో వారంలో కమిషన్ నోటీసులు ఇచ్చే అవకాశాలున్నట్లు తెలిసింది.

## ప్రధానిని కలిసిన పవన్

కుమారుడు అకీరాను కూా ప్రధానితో భేటీకి తీసుకెళ్లారు. అకీరా ఇటీవల పవన్ కల్యాణ్‌తో ఎక్కువగా కనిపిస్తున్నారు. చంద్రబాబునాయుడుతో సమావశంలోనూ అకీరా కనిపించారు. సమావేశంలో కుమారుడ్ని ప్రధానికి పరిచయం చేశారు పవన్ కల్యాణ్. ఎన్డీఏ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. రెండు ఎంపీ సీట్లు ఉన్న జనసేన పార్టీ కూడా ఎన్డీఏలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ క్రమంలో పవన్ కల్యాణ్ కూడా ఢిల్లీలో కీలక పాత్ర పోషిస్తున్నారు. బుధవారం జరిగిన ఎన్డీఏ మీటింగ్‌లో కూడా పవన్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఏర్పాటులో భాగంగా ప్రధాని మోదీ నాయకత్వానికి మద్దతిస్తూ సంతకాలు కూడా చేశారు. మరోసారి శుక్రవారం ఎన్డీఏ సమావేశం జరగనుంది. కేంద్ర మంత్రి వర్గంలో జనసేన పార్టీకి కూడా చోటు దక్కుతుందని భావిస్తున్నారు.

## 12వ తేదీ 12 గంటలకు

అపూర్వమైన మెజార్టీ స్థానాలను గెలుచుకుంది. మొత్తం 175 స్థానాలకు గానూ టీడీపీ - 136 , జనసేన - 21, బీజేపీ - 8 మొత్తం 165 స్థానాల్లో విజయం సాధించి అతిపెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించింది. అయితే జూన్ 9న అమరావతి వేదికగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. అయితే అదే రోజున ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం ఉండటంతో గతంలో ప్రకటించిన తేదీని మార్పు చేశారు. జూన్ 12న చంద్రబాబు విభజన ఆంధ్రప్రదేశ్లో రెండో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.ఈసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపడితే నాలుగు సార్లు సీఎం పదవిని అధిరోహించిన తెలుగు నాయకుడిగా సరికొత్త చరిత్రను సృష్టించబోతున్నారు. అలాగే గతంలో 1ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన అనుభవానికి ఈ ఐదేళ్లు కలిపితే మొత్తం 19 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసే అరుదైన ఘనతను సాధించబోతున్నారు నారా చంద్రబాబునాయుడు. అయితే ముందుగానే ప్రమాణస్వీకారానికి రెండు తేదీల్లో మంచి ముహూర్తాలు చూసిన పండితులు.. ఎక్కడ కార్యక్రమం ఏర్పాటు చేయాలన్న ప్రాంతాన్ని మాత్రం ఇంకా నిర్ణయించలేదు. ప్రమాణస్వీకారం చేసే ప్రాంతంపై ఇవాళ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీతో సహా పలువురు కేంద్ర మంత్రులు, పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## పిడుగుపాటుకు ఇద్దరు మృతి

జయభేరి, మెదక్:

హావేలి ఘనపూర్ (మం) శంనాపూర్ లో విషాదం నెలకొంది. గ్రామంలో పిడుగుపాటుతో ఇద్దరు మృతి చెందారు. బుధవారం సాయంత్రం పొయ్యిలో కట్టెల కోసం సిద్దయ్య (50), నందు (22) అడవికి వెళ్లారు. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో రాత్రంతా గ్రామస్తులు వెతికారు. మల్లన్నగుట్ట ప్రాంతంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందినట్టు గుర్తించారు.

# తెలంగాణలో 12.. ఏపీలో 13 స్కూల్స్ రీఓపెన్

జయభేరి, హైదరాబాద్, జూన్ 6:

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు భారీ మెజార్టీతో అధికారం కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏపీలో ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆయన జూన్ 12వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అయితే మరోవైపు వేసవి సెలవుల అనంతరం రాష్ట్రంలోని పాఠశాలలు అదే రోజు పునఃప్రారంభంకానున్నాయి.ఈ నేపథ్యంలో పాఠశాలలను ఈనెల 12కు బదులు 13న తెరవాలని టీడీపీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు. పాఠశాలల పునః ప్రారంభ తేదీని వాయిదా వేయాలని టీడీపీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ అందులో కోరారు. ఈ నెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండడంతో వాయిదా వేయాలని వినతి చేశారు. దీంతో ఏపీలో స్కూల్స్ రీ ఓపన్ తేదీ వాయిదాపడే అవకాశం ఉంది. కాగా రాష్ట్రంలోని పాఠశాలలకు ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు దాదాపు 50 రోజుల పాటు విద్యా శాఖ వేసవి సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. సెలవుల అనంతరం 202425 విద్యా సంవత్సరానికి గానూ జూన్ 12 నుంచి స్కూళ్లు తిరిగి తెరచుకోనున్నాయి. తాజా పరిణామంతో ఒకరోజు తర్వాత అంటే జూన్ 13న స్కూళ్లు తిరిగి తెరచుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు తెలంగాణలోనూ ఏప్రిల్ 24 నుంచి ప్రారంభమైన వేసవి సెలవులు జూన్ 11తో ముగియనున్నాయి. జూన్ 12న బదులు తిరిగి ప్రారంభం అవుతాయి

**ప్రస్తుతం ఏపీలో ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆయన జూన్ 12వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అయితే మరోవైపు వేసవి సెలవుల అనంతరం రాష్ట్రంలోని పాఠశాలలు అదే రోజు పునఃప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలను ఈనెల 12కు బదులు 13న తెరవాలని టీడీపీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు.**



# ఇక కమలానికి ప్రతిపక్ష హోదా?

జయభేరి, హైదరాబాద్, జూన్ 6:

పార్లమెంట్ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ చెప్పినట్లు బీజేపీ మంచి విజయాలు నమోదు చేసింది. కాంగ్రెస్ తో పోటీగా ఎనిమిది సీట్లలో విజయం సాధించింది. బీజేపీ అనుకున్న ఫలితాలను సాధించింది. అధికార కాంగ్రెస్ కూడా ఎనిమిది స్థానాలను సాధించింది. అయితే ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం ఎంపీ స్థానాల్లో ఉనికిని కోల్పోయింది. ఒక్కరంటే ఒక్కరూ విజయం సాధించలేదు. వచ్చే కొద్ది నెలల్లోనే బీజేపీనే ప్రధాన ప్రతిపక్షంగా మారే ప్రయత్నం చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న పాజిటివిటీని కాపాడుకుంటే.. బీజేపీ తెలంగాణలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడం ఖాయంగా కనిపిస్తోందని రాజకీయవర్గాలంటున్నాయి. బీజేపీ అసెంబ్లీ ఎన్నికలకు ఆరేడు నెలల ముందు కూడా అత్యంత బలంగా ఉంది. కాంగ్రెస్ బలహీనంగా ఉంది. పోటీ బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే జరుగుతుందన్న అభిప్రాయం కూడా వినిపించింది. అయితే బీజేపీ పెద్దలు తీసుకున్న కొన్ని అనూహ్య నిర్ణయాల వల్ల బీజేపీ వెనుకబడిపోయింది. కాంగ్రెస్ ఒక్క సారిగా ముందుకు వచ్చింది., బండి సంజయ్ ను మార్చేయడం.. కవితను ఎన్నికలకు ముందు అరెస్టు చేయకపోవడం వంటివి దెబ్బతీశాయని బీజేపీ నేతలు భావిస్తూ ఉంటారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలు సాధించింది. ఎనిమిది స్థానాల్లో గెలిచింది. పదహారు శాతానికిపైగా ఓటు బ్యాంక్ సాధించింది. పార్లమెంట్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ తో పోటీ పడి ఓటు బ్యాంక్ తెచ్చుకుంది. కాంగ్రెస్ పార్టీకి నలభై శాతం ఓట్లను సాధిస్తే బీజేపీ 36 శాతం ఓట్లను సాధించింది. అందుకే ప్రజాతీర్పును గౌరవించి అసలైన ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తిరుగులేని శక్తిగా మారాలన్న లక్ష్యంతో బీజేపీ ఉంది.

ప్రస్తుతం జరిగింది లోక్ సభ ఎన్నికలు కాబట్టి.. జాతీయ స్థాయి అంశాలు, మోడీ హవా కీలకంగా మారాయని.. అదే అసెంబ్లీ స్థానాలకు వచ్చే సరికి సీన్ మారిపోతుందని ... చెబుతున్నారు. అందుకే.. అసెంబ్లీకి కూడా బీజేపీ కేపబుల్ అనిపించేలా పార్టీని తీర్చిదిద్దాలని అనుకుంటున్నారు.భారతీయ జనతాపార్టీ క్రమంగా బలపడుతోంది. రాష్ట్ర విభజన తరవాత జరిగిన ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకుని ఐదు చోట్ల గెలిచింది.తర్వాత టీడీపీ పూర్తిగా బలహీనపడింది. బీజేపీ మాత్రం బలపడుతూ వస్తోంది. ఇప్పుడుటీడీపీ అసలు లేదు. బీజేపీ మేజర్ ప్లేయర్ గా ఎదిగింది. బండి సంజయ్ చీఫ్ గా ఉన్నప్పుడు పార్టీకి జవసత్వాలు వచ్చాయి. ఇప్పుడు మరింతగా మెరుగైన ఫలితాలు సాధించారు. ముందు ముందు తెలంగాణలో బీజేపీ జోరును అడ్డుకోవడం ఇతర పార్టీలకు అంత తేలిక కాదు. ఈ విషయంపై అవగాహన ఉండబట్టే రాజకీయ నేతలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపించేం అవకాశం ఉంది. ముందు మందు చేరికల్ని ప్రోత్సహిస్తే మరింత బలపడే అవకాశం ఉంది.




## మా నుంచి హేమ సస్పెండ్

ఆమె తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నారు. అందులో ఆమె పాల్గొన్నట్టు, బెంగళూరు పోలీసులు కీలక ఆధారాలు చూపించడంతో ఒక్కసారి నిందితురాలైపోయారు. వాస్తవానికి ఆ వ్యవహారంతో తనకు సంబంధం లేదని హేమ చెప్పారు. అందుకు సంబంధించి ఒక వీడియో కూడా విడుదల చేశారు. ఆ మరుసటి రోజు తన ఇంట్లో చికెన్ బిర్యాని వండుతూ కనిపించారు. కొద్ది రోజులకు మామిడికాయ పచ్చడి పెట్టే విధానం ఇదీ అంటూ మరొక వీడియోతో సందడి చేశారు. ఇలా ఎన్ని రకాల జిమ్మిక్కులకు పాల్పడినప్పటికీ బెంగళూరు పోలీసులు ఊరుకోలేదు. చివరికి ఆమె శరీరంలో రక్త నమూనాలను పరిశీలించి.. మాదకద్రవ్యాలు తీసుకున్నట్టు నిర్ధారించారు.రే* పార్టీకి సంబంధించిన కేసు హై ప్రొఫైల్ పరిధిలోది కావడం, మీడియా, సోషల్ మీడియాలో దీని గురించి విస్తృతంగా వార్తలు ప్రసారం కావడంతో కర్ణాటక ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యవహారంలో ఎంతటి వారు ఉన్నా వదిలిపెట్టకూడదని పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసును విచారిస్తోంది. రే* పార్టీ, మాదకద్రవ్యాల కేసులో ఇప్పటికే 70 మంది అనుమానితులను పోలీసులు నిందితుల జాబితాలో చేర్చారు. అందులో శరీర రక్త నమూనాలలో పాజిటివ్ గా తేలిన వారిపై కేసులు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు.." రే* పార్టీ నిర్వహించింది ఎవరు? మాదకద్రవ్యాలు సరఫరా చేసింది ఎవరు? ఆరోజు పార్టీలో ఎవరెవరున్నారు? ఎలాంటి కార్యకలాపాలకు పాల్పడ్డారు? గతంలో ఇలాంటి పార్టీలకు ఎప్పుడైనా హాజరయ్యారా? ఈ పార్టీకి హాజరయ్యేందుకు ఎంత చెల్లించారు? ఈ పార్టీ నిర్వాహకులు మీకు ఎలా పరిచయం? అనే కోణాలలో పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.రే* పార్టీ, మాదకద్రవ్యాల కేసులో హేమ అరెస్టు అయిన నేపథ్యంలో.. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ నుంచి ఆమెను సస్పెండ్ చేస్తారని తెలుస్తోంది. "మా" లో ఆమె సభ్యత్వాన్ని కూడా రద్దు చేసే యోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై మా అధ్యక్షుడు మంచు విష్ణు అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. వాస్తవానికి ఈ పార్టీలో తాను లేనని, ఫామ్ హౌస్ లో చిల్ అవుతున్నానని చెప్పిన హేమ.. ఆ తర్వాత ఈ కేసులో అరెస్టు కావడంతో.. అంతకుముందు ఆమె వెల్లడించినవన్నీ అబద్ధాలేనని తేలిపోయింది.. ప్రస్తుతం హేమ బెంగళూరులోని పరపణ అగ్రహార జైల్లో విచారణ ఖైదీగా ఉన్నారు

# అయోధ్య ప్రజలు

## రాముడ్ని, మోడీని మోసం చేశారు

జయభేరి, లక్నో, జూన్ 6

బీజేపీ యూపీ ఓటర్లు ఊహించని షాక్ ఇచ్చారు. ఏకంగా రామ మందిరం ఉన్న ఫైజాబాద్‌లోనే బీజేపీ అభ్యర్థి ఓడిపోవడం ఆ పార్టీనే కాదు అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎందుకిలా జరిగిందని ఇప్పటికే హైకమాండ్ రివ్యూ చేసుకుంటోంది. కానీ బీజేపీ యూపీలో ప్రభంజనం సృష్టిస్తుందని బలంగా నమ్మిన వాళ్లంతా వరుస పెట్టి పోస్ట్‌లు పెడుతున్నారు. హిందువులే హిందువులను వెన్నుపోటు పొడిచారంటూ రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే హిందీ రామాయణ్ సీరియల్‌లో లక్ష్మణుడిగా నటించిన సునీల్ లహిరి స్పందించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తనకు నిరాశ కలిగించాలని అసహనం వ్యక్తం చేశారు. ఓటింగ్ చాలా తక్కువగా నమోదవడంపైనా ఆవేదన చెందారు. సంకీర్ణ ప్రభుత్వం వస్తే ఐదేళ్ల పాటు వాళ్లు అది ఉంటుందా అన్న అనుమానం వ్యక్తం చేశారు. అయోధ్య ప్రజల్ని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో సీతను అనుమానించి అవమానించారని, నిజమైన రాజుకి వెన్నుపోటు పొడవడం అయోధ్య ప్రజలకు అలవాటే అంటూ ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. "లోక్‌సభ ఎన్నికల ఫలితాలు నాకెంతో నిరాశ కలిగించాయి. ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదైంది. దయచేసి ఓటు వేయాలని నేను చాలా సార్లు రిక్వెస్ట్ చేశాను. కానీ ఎవరూ నా మాట పట్టించుకోలేదు. ఒకవేళ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైతే ఐదేళ్ల పాటు ఉంటుందన్న గ్యారెంటీ లేదు. అప్పట్లో సీతమ్మ వారి శీలాన్ని అయోధ్య ప్రజలు శంకించారు. నిజమైన రాజుకి వెన్నుపోటు పొడవడం ఇక్కడి వాళ్లకు అలవాటే. అయోధ్య ప్రజలకు నా సెల్యూట్. మీరు సీతమ్మవారినే అవమానించారు. ఇక టెంట్‌లో ఉన్న రాముడికి గుడి కట్టిన వాళ్లకి ద్రోహం చేయడంలో వింతేముంది. ఇకపై ఎవరూ మిమ్మల్ని ఉపేక్షించరు" సునీల్ లహిరి, నటుడు.

తనకు ఎంతో ఇష్టమైన నటులు కంగనా రనౌత్, అరుణ్ గోవిల్ ఈ ఎన్నికల్లో గెలవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇద్దరికీ అభినందనలు తెలిపారు. అరుణ్ గోవిల్ రామాయణ్ సీరియల్‌లో రాముడిగా నటించారు. లక్ష్మణుడిగా సునీల్ లహిరి కనిపించారు. ఫైజాబాద్‌లో బీజేపీ తరపున విశ్వదీప్ సింగ్ బరిలోకి దిగారు. ఆయనపై ఎస్పీ అభ్యర్థి అక్షయ యాదవ్ 89 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు





# ప్రజా సేవకుడు బీర్ల..

- ఘనంగా ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేదుకలు
- పాల్గొన్న బోడుప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప, తెలంగాణ సిద్ధు

**జయభేరి, మేడిపల్లి జూన్ 6:**

నిరంతర ప్రజా సేవకుడు బీర్ల ఐయిలయ్య అని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప అన్నారు. ఈ మేరకు గురువారం నాడు యాదగిరి గుట్టలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు పరస్కరించుకోని ఆయన నివాసంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొని పుష్ప గుచ్చాలు అందిచి, శాలువాతో సన్మానించి,కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు నియోజకవర్గం నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ఆదర్శవంతమైన అభివృద్ధిని సాధిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో బీర్ల ఐయిలయ్య ఇలాగే ప్రజలకు సేవ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రి పదవి చేపట్టాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మరాటి మత్స్యగిరి, తెలంగాణ సిద్దు, చిందం రాజు, సాయి కుమార్, తోటకూర క్రాంతి కుమార్, తోటకూర అనిల్, బీదని కుమార్, ఆసర్ల మిథున్ తదితరులు పాల్గొన్నారు.

# జనం మెచ్చిన జననేతకు జన్మదిన శుభాకాంక్షలు

- ప్రజలంటే ప్రాణం పేదల సంక్షేమమే లక్ష్యం
- కష్టంలో ఉన్నవాళ్లకి ఆప్తుడు కష్టాల కడలి దాటించే ప్రజా నాయకుడు
- ఆయన ప్రతీ అడుగు జనహితమే
- ఏం చేసినా జనం కోసమే
- ఎవరికి కష్టం వచ్చినా క్షణాల్లోనే స్పందిస్తారు
- అక్కున చేర్చుకొని ఆదరిస్తారు
- కెకులు, కండువాలు శాలువలకు బదులు పిల్లలకు చదువుకు ఉపయోగపడే పుస్తకాలు పెన్నులు పెన్సిళ్లు అందజేసిన అభిమానులు కార్యకర్తలు



**జయభేరి, ఘట్కేసర్ :**

రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు, ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మదిన సందర్భంగా శ్రీ తాళ్ల వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నోజిగూడ శివ ఫంక్షన్ హాల్ లో జన్మదిన వేడుకలు నిర్వహించారు. వైయస్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 100 మంది పైగా రక్తదానం చేశారు. అనంతరం ఎంపీపీ కేకు బదులు పిల్లలకు చదువుకు ఉపయోగపడే పుస్తకాలు పెన్నులు పెన్సిలను బహుమతులుగా కార్యకర్తలు అభిమానులు నాయకులు వారికి అందజేశారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా విశ్రాంత కలెక్టర్ ఎం.వి రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రా రెడ్డి, నియోజకవర్గ మున్సిపల్ కార్పొరేషన్ మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, బిజెపి రాష్ట్ర నాయకులు, జిల్లా పదాధికారులు వివిధ మోర్చాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, BRS పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావుని మర్యాద పూర్వకంగా కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి మల్లారెడ్డి, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, LB నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

**జయభేరి, మేడ్చల్**

# లిట్మస్ టెస్ట్ లో రేవంత్ పాస్



**జయభేరి, హైదరాబాద్, జూన్ 6:**

తెలంగాణ లోక్ సభ ఎన్నికల ఫలితాలను బట్టే... రేవంత్ రెడ్డి ప్రభుత్వ మనుగడ ఉంటుందని రాజకీయవర్గాలు ఓ అంచనాకు వచ్చాయి. ఇప్పుడు ఫలితాలు వచ్చాయి. కాంగ్రెస్ తిరుగులేని విజయం సాధించకపోయినా సరే.. ఆ పార్టీ ప్రభుత్వానికి వచ్చే నష్టమేం లేదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. దీనికి కారణం బీజేపీతో సమానంగా సీట్లు తెచ్చుకోవడమే కాదు కేంద్రంలో బీజేపీ కి సంపూర్ణ మెజార్టీ రాకపోవడం కూడా ఓ కారణమని అంచనా వేస్తున్నారు. తెలంగాణ లోక్ సభ ఎన్నికల ఫలితాలు అనుకున్నట్లుగానే బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటాపోటాగా సాగాయి. చివరికి రెండు పార్టీలు చెరో ఎనిమిది సీట్లను గెల్చుకున్నాయి. మజ్లిస్ పార్టీ తన హైదరాబాద్ సీటును నిలబెట్టుకుంది. బీఆర్ఎస్ పార్టీకి ఒక్కటంటే ఒక్కటి కూడా రాలేదు. రెండు, మూడు చోట్ల మినహా అన్ని చోట్ల మూడో స్థానంలో ఉంది. చాలా చోట్ల డిపాజిట్లు కోల్పోయింది. కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. అంటే.. కాంగ్రెస్ కు మరో ఎమ్మెల్యే యాడ్ అయ్యారు. ఇప్పుడు కాంగ్రెస్ కు అధికారికంగా అరవై ఐదు మంది ఎమ్మెల్యేలు ఉంటారు. బీఆర్ఎస్ నుంచి వచ్చి చేరిన వారు అదనం. బీజేపీ కాంగ్రెస్ కన్నా ఒకటి , రెండు సీట్లలో ఎక్కువ సాధించి ఉన్నట్లయితే..ఆ పార్టీ నుంచి కాపాడుకోవడం కష్టమయ్యేది. ఇప్పుడు కేంద్రంలోనూ బీజేపీ బలహీన ప్రభుత్వమే ఏర్పడుతోంది. మిత్రపక్షాల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని నడపాల్సి ఉంటుంది. అందుకే వారు తెలంగాణ ప్రభుత్వం జోలికి వచ్చే అవకాశం లేదు. లంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుండి ఆ ప్రభుత్వం ఉండదని పదే పదే అభిప్రాయం చెప్పేవారే ఎక్కువగా ఉన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలు. ఎలా జరుగుతుందో కూడా విశ్లేషించేవారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరిమితంగా సీట్లు వస్తాయని.. బీజేపీకి ఎక్కువ వస్తాయని ఆ తర్వాత బీజేపీ ఆ ప్రభుత్వాన్ని పడగొట్టేస్తుందని అంచనాలు వేస్తూ వచ్చారు. కేసీఆర్ కూడా తమ పార్టీ సమావేశాల్లో ఇవే చెబుతూ వచ్చారు. వందకుపైగా ఎమ్మెల్యేలు ఉన్న తన ప్రభుత్వాన్నే కూల్చేందుకు బీజేపీ నేతలు ప్రయత్నించారని కాంగ్రెస్ కు సహించే ప్రశ్నే ఉండదని ఆయన అభిప్రాయం. ఈ పరిస్థితి తీసుకు రావడానికి ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో కేసీఆర్ బీజేపీకి సహకరించారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరిగిందని తేల్చేందుకు బీజేపీకి సైలెంట్ గా సపోర్టు చేశారు. అది లోక్ సభ ఎన్నికల ఫలితాల్లో స్పష్టమయింది. తెలంగాణలో బీజేపీ .. ఎనిమిది సీట్లు సాధించింది కానీ... దేశంలో అంత ప్రోత్సాహకర ఫలితాలు లేవు. అందుకే బీజేపీ సంయమనం పాటించే అవకాశం ఉంది. అయితే ఇప్పుడు బీజేపీ బలపడే ప్రయత్నాలు మాత్రం ఆపదు. బీఆర్ఎస్ ఉనికిని వీలైనంతంగా పరిమితం చేసేందుకు ప్రయత్నిస్తుంది. బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ ను కాపాడుకోలేకపోయింది. ఇప్పుడు ఆ పార్టీకి చెందిన క్యాడర్ ను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పంచుకుంటాయి. ఎక్కువగా బీజేపీ పంచన చేరిపోతారు. ఎందుకంటే.. మరో రెండు, మూడేళ్ల తర్వాత అయినా కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా నిలబడే పార్టీగా బీజేపీనే చూస్తారు. అందుకే ఆ పార్టీలో చేరిపోతారు. బీఆర్ఎస్ బలహీనపడుతుంది. క్రమంగా బీఆర్ఎస్ స్థానాన్ని బీజేపీ ఆక్రమిస్తుంది. ఎమ్మెల్యేల చేరికలతో అసెంబ్లీ లోనూ ప్రతిపక్ష స్థానానికి బీజేపీ చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఉండదు.మరో వైపు రేవంత్ రెడ్డికి వ్యక్తిగతంగా ఫలితాలు ఇబ్బందికరమే. ఆయనపై హైకమాండ్ కు పార్టీ నేతలు లేనిపోనివి చెప్పుకోవడానికి ఎక్కువ అవకాశాలు కల్పించినట్లవుతుంది. మహబూబ్ నగర్ పార్లమెంట్ స్థానంలో గట్టిగా పోరాడినా ఓడిపోవాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులే గెలిచినా పార్టీ ఓడిపోయింది. డీకే అరుణకు.. బీఆర్ఎస్ పార్టీ సహకరించడమే కారణం. అలాగే తన సిట్టింగ్ సీటు మల్కాజిగిరిలో బీజేపీ అభ్యర్థి ఈటల భారీ మెజారిటీతో గెలిచారు. అయితే ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలు రేవంత్ ను గట్టెక్కించాయని అనుకోవచ్చు. బీజేపీ అగ్రనేతలు కోరుకున్నట్లుగా నాలుగు వందల సీట్లు కేంద్రంలో వచ్చినట్లయితే రేవంత సర్కార్ కు కౌంట్ డౌన్ ప్రారంభమయ్యేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. రేవంత్ సేఫ్ జోన్ లోకి వెళ్లారు.

# 40 ఏళ్ల తర్వాత మహిళకు పట్టం



**జయభేరి, వరంగల్, జూన్ 6 :**

చరిత్రాత్మక వరంగల్ పార్లమెంటు ఎంపీగా 4 దశాబ్దాల తర్వాత మహిళ పార్లమెంట్ లో అడుగుపెడుతోంది. 1984లో వరంగల్ పార్లమెంట్ స్థానం నుండి మహిళ ప్రాతినిధ్యం వహించింది. సుదీర్ఘకాలం తరువాత 2024 ఎన్నికల్లో వరంగల్ పార్లమెంటు స్థానం నుండి మరో మహిళకు చట్టసభలకు వెళ్లే అవకాశం వచ్చింది. మరో విశేషమేమిటంటే ఇద్దరూ డాక్టర్లే. ఆ మహిళా ఎంపీలే ఒకరు డాక్టర్ కల్పనా దేవి కాగా మరొకరు డాక్టర్ కడియం కావ్య. 1980 దశకంలో రాజకీయాల్లో మహిళలకు అంతంత ప్రాధాన్యత ఉన్న సమయంలో డాక్టర్ వృత్తిలో కొనసాగుతున్న కల్పన దేవి 1984లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా వరంగల్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేసి విజయం సాధించింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా తెలుగుదేశం పార్టీ రావడం జరిగింది. వరంగల్ పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేసిన కల్పన దేవి సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కమాలుద్దీన్ హమ్మద్ పై 8 వేల 456 ఓట్ల తో విజయం సాధించింది. కొత్తగా వచ్చిన తెలుగు దేశం పార్టీ కి తోడు మహిళగా వరంగల్ జిల్లా రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగింది. 1984లో కల్పన దేవి తరువాత ఎంపీ గా వరంగల్ పార్లమెంట్ స్థానం నుండి మహిళకు అవకాశం రాలేదు. 2024 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అనేక రాజకీయ పరిణామాల మధ్య కడియం కావ్య కాంగ్రెస్ పార్టీ నుండి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీలో నిలబడింది. కావ్య అభ్యర్థిత్వం పై అనేక ఆరోపణలు, ప్రత్యర్థులు విమర్శలు తీవ్ర రాజకీయ చర్చకు దారితీసాయి. గెలుపే కష్టమనుకున్న సమయంలో 2 లక్షల 19 వేల 691 ఓట్ల మెజార్టీ తో రికార్డు సృష్టించింది. సమీప బిజెపి అభ్యర్థి ఆరూరి రమేష్ పై విజయం సాధించింది. 40 సంవత్సరాల తరువాత రాణి రుద్రమ వారసురాలిగా పార్లమెంటులో అడుగుపెడుతుంది.కల్పన దేవి రాజకీయాల్లోకి రాకముందు. వరంగల్ నగరంలో ప్రైవేట్ నర్సింగ్ హోమ్ నిర్వహిస్తూ డాక్టర్ గా కొనసాగుతుంది. తెలుగు దేశం పార్టీ ఏర్పాటు తో రాజకీయాల్లో వచ్చిన కల్పన దేవి 1984 ఎన్నికై ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ లో చేరి సుదీర్ఘ కాలం వరంగల్ జిల్లా రాజకీయాల్లో కొనసాగారు. 2024 లో గెలిచిన కడియం కావ్య సైతం డాక్టర్. వైద్య విద్యను పూర్తి చేసిన కావ్య ప్రభుత్వ వైద్యురాలిగా కొనసాగుతూ తండ్రి కడియం శ్రీహరి వారసురాలిగా రాజకీయాల్లోకి వచ్చారు. 1984 లో 2024 లో వరంగల్ పార్లమెంట్ సభ్యులుగా పార్లమెంట్ లో అడుగుపెట్టారు. కల్పన దేవి తరువాత 2008 లో వరంగల్ పార్లమెంట్ కు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున కొండ సురేఖ పోటీ చేసే అవకాశం వచ్చినా విజయం సాధించలేదు.



# మంత్రివర్గ శాఖలపై కసరత్తు

**జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 6:**

లోక్‌సభ ఎన్నికల్లో 240 సీట్ల సాధించిన భారతీయ జనతా పార్టీ సొంతంగా మేజిక్ ఫిగర్ దాటకపోవడంతో.. మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఎన్డీయే పక్షాలను ప్రభుత్వంలో భాగం చేసే క్రమంలో ఏ పార్టీకి ఎన్ని మంత్రి పదవులు ఇవ్వాలి.. ఏయే శాఖలు కేటాయించాలనే దానిపై కసరత్తు జరుగుతోంది. ఢిల్లీలో కీలక సమావేశాలు నిర్వహిస్తోంది బీజేపీ. ఉదయం బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం కానున్నారు బీజేపీ పెద్దలు. ఆ తర్వాత బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం ఎన్డీయే ఎంపీలతో మీటింగ్ జరగనుంది. ఇప్పటికే ఎన్డీయే కూటమి నాయకుడిగా ఏకగ్రీవంగా మోడీని ఎంపీక చేశారు. దీనికి చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్ తోపాటు 23 పార్టీలు మద్దతు ఇచ్చాయి. ఇక రాష్ట్రపతిని కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించమని ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు కోరనున్నారు. మరోవైపు కూటమిని విస్తరించే అంశంపైనా బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. దేశవ్యాప్తంగా గెలిచిన స్వతంత్ర ఎంపీలతో పాటు తటస్థ పార్టీలను ఎన్డీయే కూటమిలోకి ఆహ్వానించే ప్రయత్నాల్లో ఉంది బీజేపీ అగ్రనాయకత్వం. అమిత్ షా తోపాటు రాజ్‌నాథ్‌సింగ్‌కి ఈ బాధ్యతలు అప్పగించింది బీజేపీ.ఆదివారం (జూన్ 9) సాయంత్రం 6 గంటలకు మూడోసారి భారత ప్రధానిగా ప్రమాణం చేయబోతున్నారు నరేంద్రమోదీ. కేబినెట్ కూర్పుపై దృష్టి సారించారు మోదీ. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శాఖల కేటాయింపులపై చర్చించినట్లు సమాచారం. అయితే కీలక శాఖలైన హోంశాఖ, రక్షణశాఖ , ఆర్థికశాఖ , రైల్వే శాఖ , విదేశాంగ శాఖలను తమ దగ్గరే ఉంచుకోవాలని బీజేపీ నేతలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. మిత్రపక్షాలు ఈ శాఖలపై ఎలాంటి ఒత్తిడి చేసినా వెనక్కి తగ్గవద్దని బీజేపీ నేతలు నిర్ణయించినట్టు సమాచారం.స్పీకర్ పదవిని కూడా మిత్రపక్షాలకు ఇవ్వరాదని బీజేపీ నేతలు నిర్ణయించారు. టీడీపీకి పౌర విమానయానశాఖ , ఉక్కు శాఖ ఇచ్చే అవకాశం ఉంది. గ్రామీణాభివృద్ధి శాఖ , పంచాయతీరాజ్ శాఖలు జేడీయూకు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. శివసేన షిండే వర్గానికి పరిశ్రమల శాఖ ఇచ్చే అవకాశం ఉంది. జేడీఎస్‌కు వ్యవసాయశాఖ ఇచ్చే అవకాశం ఉంది.




# అమెరికా అదుర్స్..

## సూపర్ ఓవర్‌లో పాక్‌పై సంచలన విజయం

సూపర్ ఓవర్‌లో పాక్‌పై అద్భుత విజయం
టీ20 ప్రపంచకప్ టోర్నీ

**డల్లాస్:** ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య అమెరికా అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. టైటిల్ ఫెవరేట్లలో ఒకటైన పాకిస్థాన్‌పై అమెరికా సంచలన విజయంతో కదంతొక్కింది. గురువారం ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన పోరు( సూపర్ ఓవర్)లో యూఎస్‌ఏ చారిత్రక విజయం సాధించింది. మహమ్మద్ ఆమిర్ వేసిన సూపర్ ఓవర్‌లో అమెరికా ఒక వికెట్ కోల్పోయి 18 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పాక్ వికెట్ కోల్పోయి 13 పరుగులకు పరిమితమైంది. టీ20ల్లో పాకిస్థాన్‌పై యూఎస్‌ఏకు ఇది తొలి విజయం కావడం విశేషం. అంతకుముందు టాస్ కోల్పోయిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులకే పరిమితమైంది.
ఆ జట్టు బ్యాటర్లలో సారథి బాబర్ ఆజమ్ (44), షాదాబ్ ఖాన్ (40) ఫర్వాలేదనిపించగా ఆఖర్లో షహీన్ షా అఫ్రిది (23 నాటౌట్) మెరుపులతో పాక్ ఆ మాత్రం స్కోరైనా చేసింది. రిజ్వాన్(9), ఉస్మాన్‌ఖాన్(3) ఫకర్ జమాన్(11), అజమ్‌ఖాన్(0) ఘోరంగా విఫలమయ్యారు. అమెరికా బౌలర్లు సమిష్టిగా రాణించి బాబర్ సేనను కట్టడి చేశారు. నొస్తుష్‌కెంజిగె (3/30), నేత్రవల్కర్ (2/18) అద్భుత బౌలింగ్‌తో పటిష్టమైన పాక్ బ్యాటింగ్ ఆర్డర్ విఫలమైంది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన అమెరికా 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి సరిగ్గా 159 పరుగులు చేసింది. ఓపెనర్ మెనాక్ పటేల్ (50), అరోన్ జోన్స్(36 నాటౌట్), అండ్రీస్ గౌస్(35) రాణించారు. అమిర్, నసీమ్‌షా, రవూఫ్ ఒక్కో వికెట్ తీశారు. మోనాక్ పటేల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**సంక్షిప్త స్కోర్లు:**
పాకిస్థాన్: 20 ఓవర్లలో 159/7 (బాబర్ 44, షాదాబ్ 40, కెంజిగె 3/30, నేత్రవల్కర్ 2/18).
అమెరికా: 20 ఓవర్లలో 159/3 (మోనాక్ పటేల్ 50, జోన్స్ 36 నాటౌట్, అమిర్ 1/25, నసీమ్ 1/26)

**సూపర్ ఓవర్ స్కోర్లు**
అమెరికా: 18/1. పాకిస్థాన్: 13/1




# అందుకే ఈమె సింగిల్‌గా మిగిలి పోయిందట

ఈమె అందం భరించడం ఏం మగవాడి తరం కాదు

అమ్మాయి అందంగా ఉంటే అబ్బాయిలు ఆమెనే చూస్తూ మైమరచిపోతారు. ఆమెను కలల రాణిగా ఊహించుకుంటారు. కానీ ఒక అమ్మాయికి తన అందమే శాపం అయిందట.


అందంగా ఉండడం దేవుడిచ్చిన వరం. కళ్ళు తిప్పుకోలేని అందంతో ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన వారెందరో. అయితే ఒక అమ్మాయి మాత్రం తన అందమే తనకు శాపం అయిందని చెబుతోంది. తన అందాన్ని చూసి... ఇంతటి అందం భరించలేమంటూ మగవారు అంతా పారిపోతున్నారని అంటోంది. ఆమె పేరు ఆష్లే. ఫ్యాషన్ స్టైలిస్ట్ గా పని చేస్తోంది. ఆమె టిక్ టాక్ లో చాలా ఫేమస్. ఆమె ఎంత అందంగా ఉంటుందంటే చూస్తూ అలా ఉండిపోవాలనిపిస్తుంది. కానీ ఇంతవరకు ఆమెతో ఏ అబ్బాయి కూడా డేటింగ్ చేయలేదు. తాను సింగిల్ గానే ఉన్నానని చెబుతోంది. ఆమె తన సోషల్ మీడియా ఖాతాలో పెట్టిన పోస్ట్ ఇప్పుడు వైరల్ గా మారింది.
తనను ఇష్టపడి తన వెనక పడే అబ్బాయిలే లేరని అని నిరాశగా చెబుతోంది ఆష్లే. తనను చూసి మైమరిచిపోతారు... కానీ ఇంత అందంగా ఉన్న అమ్మాయి తమ ప్రేమను ఒప్పుకోదులే అని ఎంతోమంది మగవారు స్వచ్ఛందంగానే ఆగిపోతున్నారని చెబుతోంది. ఆమెకు సహజంగానే ఎంతో అందమైన చర్మం వచ్చింది. దానికి కాస్త మెరుపుల మేకప్ చేస్తే ఇక అందాన్ని భరించడం ఎవరి తరం కాదట. అందుకే ఎంతోమంది పురుషులు ఆమెను దూరం నుంచి చూస్తూ ఆరాధిస్తున్నారు, కానీ వారి మనసులోని మాటలు మాత్రం బయట పెట్టడం లేదు. చెప్పినా కూడా అంత అందగత్తె తమను ఒప్పుకోదులే అనుకుంటున్నారట.
ఆష్లే తన సోషల్ మీడియా ఖాతాలో 'నేను సింగిల్ గానే మిగిలిపోయాను, ఎంతో ఒంటరిగా ఉన్నాను' అంటూ చెప్పుకోస్తోంది. టిక్ టాక్ లో కూడా ఇదే విషయాన్ని చెప్పింది. 'నేను అందంగా ఉన్నా ఇప్పటికీ సింగిల్ జీవితాన్నే గడుపుతున్నాను' అంటూ బాధపడుతోంది. ఆష్లే అందమైన అమ్మాయి మాత్రమే కాదు, చాలా తెలివైన అమ్మాయి కూడా. ఫ్యాషన్ స్టైలిస్ట్ గా తన రంగంలో చక్కగా రాణిస్తోంది. ఆమె వీడియోలలో యాంకర్ గా పనిచేస్తుంది. ఆమె ఇష్టపడే వారి సంఖ్య ఎక్కువే, కానీ ఎవరూ ఆమె దగ్గరికి వెళ్లి ప్రేమను వ్యక్తపరచరు. కొంతమంది మాత్రం... ఆ అందం వల్ల ఆమె అహంకారిగా మారిందని అంటారు. అలాగే ఆమెకు ఇతరులు కన్నా తన మీద తనకే శ్రద్ధ ఎక్కువని, అందుకే ఆమె సింగిల్ గా మిగిలిపోయింది అని వాదించే వారు కూడా ఉన్నారు. ఆష్లే మాత్రం తనను ఆరాధించే వ్యక్తి, ప్రేమించే వ్యక్తి కోసం ఎంతగానో ఎదురుచూస్తోంది. ఎవరో ఒకరు ధైర్యం చేసి తనతో డేటింగ్ చేస్తారని ఆశిస్తోంది. తనకు తానుగా మాత్రం ఏ మగవాడికి ప్రపోజ్ చేయనని, మగవారే ధైర్యంగా తన ముందుకు వచ్చి చెబితే, అతనితో డేటింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని... టిక్ టాక్ వీడియోలో వివరిస్తోంది. ఈమె అమెరికాలో జీవిస్తోంది. అక్కడ టిక్ టాక్ పై ఎలాంటి నిషేధం లేదు.
ఆష్లే సమస్యను 'ప్రెట్టీ ప్రివిలేజ్' కాన్సెప్ట్ గా చెప్పుకోవచ్చు. గత ఏడాదే ఈ కాన్సెప్ట్ ఆన్ లైన్లో చర్చలకు దారితీసింది. అందంగా ఉండడం వల్ల లభించే లాభాలు, సానుకూలతలతో పాటూ ప్రతికూలతలను కూడా ఈ ప్రెట్టీ ప్రివిలేజ్ అంశం హైలైట్ చేస్తుంది. కొందరికి అందం ఎంతో మేలు చేస్తే, మరికొందరికి ప్రతికూలతలను అందిస్తుంది. ఆష్లేకు అందమే ప్రతికూలంగా మారింది.



# స్కిన్ అలర్జీలను పోగొట్టేందుకు చిట్కాలు

స్కిన్ అలర్జీలు అనేవి ఈ కాలంలో సాధారణం. అయితే వాటిని పోగొట్టుకునేందుకు ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటించాలి.

స్కిన్ అలర్జీలు చాలా మందిని ప్రభావితం చేసేవి. కొన్నిసార్లు కొన్ని ఆహారపదార్థాల వల్ల లేదా కొన్ని క్రీములు లేదా సౌందర్య సాధనాల వాడకం వల్ల చర్మం అలర్జీకి గురవుతుంది. మీ చర్మంపై దద్దుర్లు, మొటిమలు, దురద వంటి సమస్యలు కనిపించడం ప్రారంభిస్తాయి. ఇది మీ ముఖం, శరీరంపై మచ్చలను కలిగిస్తుంది. చర్మ అలెర్జీలు ఆహార అలెర్జీల నుండి పూర్తిగా భిన్నంగా ఉంటాయి. చాలా కష్టంగా కూడా అనిపిస్తుంది.
చర్మ అలెర్జీ విషయంలో కొన్నిసార్లు మీ శరీరంపై లేత ఎరుపు రంగు మచ్చలను కలిగిస్తుంది. కొన్ని అలెర్జీలు తేలికపాటివి, కొన్ని తీవ్రంగా ఉండవచ్చు. కొన్ని అలర్జీలను మందులతో నయం చేయవచ్చు. కానీ తేలికపాటి అలర్జీలను నిర్వహించడంలో సహాయపడే కొన్ని గొప్ప ఇంటి నివారణలు ఉన్నాయి. మీ శరీరంలో చర్మ అలెర్జీ లక్షణాలను, గమనించినట్లయితే, దాని నుండి తక్షణ ఉపశమనం పొందడానికి ఈ ఇంటి నివారణలను ప్రయత్నించవచ్చు.
**అలోవెరా :** అలోవెరా మీ చర్మానికి చాలా మేలు చేస్తుంది. కలబందలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు చర్మ అలర్జీలను దూరం చేయడంలో సహాయపడతాయి. దీన్ని ఉపయోగించడానికి మీ అలెర్జీ ప్రభావిత ప్రాంతంలో కలబంద జెల్‌ను అప్లై చేయండి. దీన్ని 15 నిమిషాలు ఆరనివ్వండి, ఆపై సాధారణ నీటితో శుభ్రం చేసుకోండి.
**వేప :** వేప అనేక చర్మ సమస్యలను దూరం చేస్తుంది. వేపలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నందున, ఇది చర్మ అలెర్జీలను తొలగించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటుంది. వేప నూనెను ప్రభావిత ప్రాంతంలో రాసి 15 నుండి 20 నిమిషాల తర్వాత సాధారణ నీటితో శుభ్రం చేసుకోండి. వేప నూనెను ఉపయోగించడం వల్ల చర్మంపై దురద, దద్దుర్లు నుండి ఉపశమనం లభిస్తుంది. వేప ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీటితో స్నానం చేయడం వల్ల చర్మ అలర్జీల నుంచి ఉపశమనం లభిస్తుంది.
**తులసి :** తులసి మీకు సీజనల్ వ్యాధులను దూరం చేస్తుంది. చర్మ అలెర్జీలు ఉంటే, తులసి ఆకులను తీసుకొని పేస్ట్ చేయండి. ప్రభావిత ప్రాంతంలో ఈ పేస్ట్‌ను అప్లై చేయండి. పేస్ట్ ఆరిపోయినప్పుడు, సాధారణ నీటితో శుభ్రం చేసుకోండి.
**టీ ట్రీ ఆయిల్ :** టీ ట్రీ ఆయిల్ స్కిన్ అలర్జీల చికిత్సలో చాలా సహాయపడుతుంది. ఇది యాంటీమైక్రోబయల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంది. అనేక రకాల చర్మ అలెర్జీల నుండి మీకు ఉపశమనం ఇస్తుంది. టీ ట్రీ ఆయిల్ చర్మం ఎరుపు, దురదను తొలగించడానికి ఒక గొప్ప మార్గం.
**ఆలివ్ ఆయిల్ :** ఆలివ్ ఆయిల్ చర్మంపై అద్భుతమైన మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. విటమిన్ E సమృద్ధిగా ఉన్న ఆలివ్ ఆయిల్ మీ అలెర్జీ సంబంధిత సమస్యలకు చికిత్స చేస్తుంది. చర్మాన్ని నయం చేస్తుంది. మరమ్మత్తు చేస్తుంది. దురదను తగ్గిస్తుంది. కెమికల్ బేస్డ్ మాయిశ్చరైజర్స్ కంటే ఈ హోం రెమెడీ చాలా బెటర్.
**బేకింగ్ సోడా :** బేకింగ్ సోడా చర్మ అలెర్జీలకు ఉత్తమమైన ఇంటి నివారణలలో ఒకటి. ఇది చర్మపు దద్దుర్లు తొలగించడంలో సహాయపడుతుంది. దురద నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. చర్మం మంటను నివారిస్తుంది. బేకింగ్ సోడాను చర్మానికి అప్లై చేసేటప్పుడు అర టీస్పూన్ బేకింగ్ సోడా మాత్రమే ఉపయోగించాలి. దీన్ని కొద్దిగా నీళ్లలో కలిపి పేస్ట్‌లా చేసి అలర్జీ ప్రభావిత ప్రాంతంలో అప్లై చేయాలి. కొన్ని నిమిషాల తర్వాత కడిగేయండి. ఫలితం ఉంటుంది.
**యాపిల్ సైడర్ వెనిగర్ :** యాపిల్ సైడర్ వెనిగర్ శరీరంలోని అనేక సమస్యలను పరిష్కరించడంలో సహాయపడుతుంది. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు అలర్జీలను తొలగిస్తాయి. చర్మ అలెర్జీలకు చికిత్స చేయడానికి ఒక కప్పు వెచ్చని నీటిలో ఒక టేబుల్ స్పూన్ వెనిగర్ కలపండి. ఈ మిశ్రమాన్ని ప్రభావిత ప్రాంతంపై రాయండి. 15 నిమిషాల ఆరిన తర్వాత సాధారణ నీటితో శుభ్రం చేసుకోవాలి.
**కొబ్బరి నూనె :** కొబ్బరి నూనె చర్మానికి పోషణను అందించడమే కాకుండా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ప్రభావిత చర్మం ప్రాంతంలో కొబ్బరి నూనెను సున్నితంగా అప్లై చేయండి. 15 నుంచి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. ఆ తరువాత, సాధారణ నీటితో శుభ్రం చేసుకోండి. కొబ్బరి నూనెను ఉపయోగించడం వల్ల చర్మంపై దద్దుర్లు, మంట, దురద నుండి ఉపశమనం పొందవచ్చు.






# రీఎంట్రీ అల్లరి పిల్ల

2012లో 'నాఇష్టం' సినిమా తర్వాత నితేష్ దేశ్ముఖ్‌ని పెళ్లాడేసి, సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టేసింది జెనీలియా. ఇద్దరు పిల్లలకు తల్లి అయినా కూడా జెనీలియాలోని ఆ అల్లరి హాసిని మాత్రం ఇంకా అలాగే ఉందని తన భర్తతో కలిసి ఆమె చేసే ఇన్‌స్టా రీల్స్ చెప్పకనే చెబుతుంటాయి. నితేష్, జెన్నీ కలిసి చేసే రీల్‌స్‌ని ఇష్టపడేవాళ్లు లక్షల్లో ఉంటారు. రీసెంట్‌గా భర్తతో కలిసి సొంతంగా చిత్ర నిర్మాణం కూడా మొదలుపెట్టిన జెనీలియా.. తన భర్త రితేష్‌తో కలిసి మరాఠీలో 'వేద్' అనే సినిమాలో నటించింది. తెలుగులో వచ్చిన 'మజిలీ'.. ఈ 'వేద్'కు మాతృక కావడం విశేషం. 'మజిలీ'లో సమంత పాత్రను 'వేద్'లో జెనీలియా చేసి, మరాఠీ ప్రేక్షకుల కితాబులందుకుంది. ఇక అసలు విషయానికొస్తే, మంచి పాత్ర దొరికితే తెలుగులోనూ నటించడానికి రెడీ అని స్టేట్‌మెంట్ ఇచ్చేసింది జెనీలియా. అయితే.. తను తెలుగులో హీరోయిన్‌గా చేస్తుందా? లేక ప్రత్యేక పాత్రలు చేస్తుందా? అనేది తెలియాల్సివుంది. నిజానికి జెనీలియా కంటే సీనియర్లయిన త్రిష, నయనతార నేటికీ హీరోయిన్లుగా చలామణీ అవుతున్నారు. వీరిలో నయన్ కూడా ఇద్దరు పిల్లల తల్లే. అలాంటప్పుడు ఇప్పటికీ అందంగానే ఉన్నా జెనీలియా హీరోయిన్‌గా ఎందుకు చేయకూడదని ఆమె అభిమానులు అభిప్రాయపడుతున్నారు. చూద్దాం.. 'హాసిని' తెలుగు ఎంట్రీ ఎలా ఉంటుందో..



# కాజల్ అగర్వాల్ ఇంప్రెస్ చేసిందా..?

టాలీవుడ్ భామ కాజల్ అగర్వాల్ ఫాలోవర్లు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న చిత్రం సత్యభామ. క్రైం థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ మూవీ నేడు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ వీడియో, రషెస్‌లో పోలీసాఫీసర్ సత్యభామగా స్టన్నింగ్ అవతార్‌లో కనిపించి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తూ.. సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేసింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ కాజల్ అగర్వాల్ అభిమానులకు కావాల్సిన ఫుల్ ఎలిమెంట్‌స్‌తో సాగుతున్నట్టు ఇప్పటివరకు వచ్చిన టాక్ చెబుతోంది. కాజల్ అగర్వాల్ నటన ఇంప్రెసివ్‌గా సాగుతూ.. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, కాజల్ యాక్షన్ పార్టును తెరకెక్కించిన తీరు అద్భుతమని అంటున్నారు సినీ జనాలు. కాజల్ యాక్షన్ సీక్వెన్స్, సిల్వర్ స్క్రీన్‌పై భావోద్వేగపూరిత సన్నివేశాలను పండించిన తీరు, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాకు మెయిన్ హైలెట్‌గా నిలిచాయని ట్రేడ్ సర్కిల్ టాక్. మూవీలో she safe app ప్రాముఖ్యతను ప్రభావవంతంగా చూపిస్తూ.. థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్‌స్‌ను అందిస్తుందని నెటిజన్లు అంటున్నారు. కాజల్ హైఓల్టేజీ పర్‌ఫార్మెన్స్‌తో పవర్‌ఫుల్ కాప్‌గా నయా అవతార్‌లో కనిపించిందని, ట్విస్టులు, మలుపులతో రొటీన్ కథలను భిన్నంగా సాగుతూ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తుందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు.

సుమన్ చిక్కాలా డెబ్యూ డైరెక్టర్ అనే ఛాయలేమి కనిపించకుండా స్క్రిప్ట్‌ను చాలా సేఫ్‌గా హ్యాండిల్ చేశాడని ఇన్‌సైడ్ టాక్. ఇటీవల కాలంలో వచ్చిన ఉత్తమ యాక్షన్ థ్రిల్లర్ సినిమాల్లో ఒకటిగా నిలిచిపోనుందని తాజా టాక్ చెబుతోంది. మరి సత్యభామ కలెక్షన్లు ఎలా ఉండబోతున్నాయనేది చూడాలి.

సుమన్ చిక్కాలా డైరెక్ట్ చేసిన ఈ చిత్రాన్ని ఆరమ్ ఆర్ట్స్ బ్యానర్‌పై బాబీ టిక్కా నిర్మించారు. శ్రీచరణ్ పాకాల మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారు. ఈ మూవీలో ప్రకాశ్ రాజ్, నాగినీడు, హర్షవర్ధన్, రవి వర్మ, అంకిత్ కొయ్య, సంపద ఎన్, ప్రజ్వల్ ఎద్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# ఎట్టకేలకు ముగించనున్న గేమ్‌చేంజర్

రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' సినిమా షూటింగ్ మొదలై అప్పుడే రెండేళ్లు దాటింది. సజావుగా సాగాల్సిన ఈ సినిమా షూటింగ్‌కు 'ఇండియన్ ఫ్రాంచైజీ' రూపంలో అనుకోని అంతరాయాలు ఎదురయ్యాయి. ఈ ఒడిదుడుకుల ప్రయాణాన్ని ఎట్టకేలకు ముగించనున్నాడు 'గేమ్ చేంజర్'. మరో పదిరోజుల్లో రామ్‌చరణ్.. తన వెర్షన్‌కు సంబంధించిన షూటింగ్ అంతా పూర్తి చేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇందులో రామ్‌చరణ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ రెండు పాత్రల్లోనూ రామ్‌చరణ్ యువకుడిగానే కనిపించనుండటం విశేషం. తండ్రి పాత్ర 70ల్లో సాగితే, కొడుకు పాత్ర సమకాలీనంగా సాగుతుందని తెలుస్తున్నది. తండ్రికి జోడీగా అంజలి, కొడుకుకి జోడీగా కైరా అడ్వానీ నటిస్తున్న విషయం తెలిసిందే. సమకాలీన రాజకీయాలకు అద్దం పడుతూ, సమాజంలోని సమస్యలను ఎత్తిచూపుతూ శంకర్ మార్క్ చిత్రంగా ఈ సినిమా ఉండబోతున్నదని తెలుస్తున్నది. ఈ ఏడాది చివర్లో ఈసినిమాను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. శంకర్ దర్శకత్వంలో శ్రీవేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com